క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజలు నిర్వహించి పూలతో ప్రత్యేకంగా అలంకరించి, ఒడి బియ్యం కార్యక్రమం జరిపించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ అరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరేష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రహ్మణ్యం శాస్త్రి పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



కవులను సత్కరించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నడిగడ్డలోని రాయల్ స్కూల్‌లో నిర్వహించిన తెలుగు, ఉర్దూ కవి సమ్మేళనం ఆహూతులను అలరించింది.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ ఎస్ఎండీ నౌమాన్ హాజరై మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లిం కవులు, రచయితల పాత్ర చిరస్మరణీయమన్నారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న తెలుగు, ఉర్దూ కవులను సత్కరించారు. సంఘం అధ్యక్షుడు ఎండీ రఫీ, కవులు..అబ్దుల్‌సమ్మద్, ముర్తుజా, కొప్పుల ప్రసాద్, నీలకంఠమాచారి, అబ్దుల్‌వహాబ్, డాక్టర్ మహమ్మద్ జాఫర్, మద్దిలేటి, రవి, అంజాద్‌ఖాన్ పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలి



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధి సిబ్బంది

గోస్పాడు: ఉపాధి సిబ్బందికి పనిభారం తగ్గించాలని ఏపీవో గంగన్న, సిబ్బంది కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆమానుల్లాకు వినతి పత్రం అందజేశారు. ఏపీవో మాట్లాడుతూ ఫాంపాండ్స్ తవ్వకాలపై లక్ష్యం నిర్దేశించడం సరికాదని, రైతులు ముందుకు రానప్పుడు తామెలా తవ్వించగలమని ప్రశ్నించారు. అలాగే కూలీలకు పూర్తిస్థాయి వేతనం రూ.307 అందాలంటే కొలతల మేరకు పనిచేయాలని, అలా కాకుండా పనిచేసిన వారందరికీ అదే వేతనం లభించాలని చెప్పడం, తమపై ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసమన్నారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇంటి వద్ద నుంచే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు



పోషణ్ ట్రాకర్ యాప్ పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోస్పాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పేందుకు పేర్లను ఇంటి వద్ద నుంచి పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని అంగన్‌వాడీ సూపర్ వైజర్ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని ఎం. చింతకుంట గ్రామంలో శుక్రవారం పోషణ పక్షోత్సవ కార్యక్రమాన్ని సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ గర్భిణులు,బాలింతలు, 6 నెలల నుంచి ఆరు సంవత్సరాల పిల్లల వరకు ఎవరైనా అంగన్‌వాడీలో పేరు నమోదు చేసుకోవడానికి ఇక నుంచి కేంద్రానికి వెళ్లకుండానే పోషణ్ ట్రాకర్‌లో ఇంటివద్ద నుంచే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

వైభవంగా అక్కదేవతల విగ్రహ ప్రతిష్ట



అక్కదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

దొర్నిపాడు: మండలకేంద్రం దొర్నిపాడు శివారులోని కేసీ కెనాల్ సమీపంలో నిర్మించిన ఆలయంలో అక్కదేవల విగ్రహ ప్రతిష్టను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, ప్రధాన కలశస్థాపన, ప్రాణప్రతిష్ట, పూర్ణాహుతి, జ్వాలా దర్శనం, మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం నిర్వహించారు.

మహిళా విద్యకు పూలే కృషి



జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ, పోలీసు అధికారులు

బొమ్మలసత్రం: మహిళా విద్య కోసం జ్యోతిరావు పూలే జ్యోతిబా పాఠశాలను స్థాపించి విశేష కృషి చేశారని ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా అన్నారు. శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఎస్పీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు పూలే కృషి చేశారన్నారు. పూలే భార్యకు చదువు నేర్పి బాలికలందరికీ విద్యను అందించేలా ఆమెతో విద్యా బోధన చేయించారన్నారు. అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, అసిస్టెంట్ ఏవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

- నంద్యాల(అర్బన్): దళితులు, మహిళలు ఇతర వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహాత్మా జ్యోతిబా పూలేను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. పూలే జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణం పద్మావతి నగర్ సమీపంలోనున్న ఆయన విగ్రహానికి వివిధ ప్రజా సంఘాల నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సంఘ నాయకులు రమణయ్య గౌడ్, శ్రీనివాసులు, పులికొండన్న, గుర్రప్ప, పృథ్వీరాజ్ యాదవ్, గుర్రం లక్ష్మి, రామచంద్రుడు, శ్రీనివాసులు, ఎస్‌కే బాలనాయక్, విజయ గౌరీ, జిల్లెల్ల శ్రీరాములు పాల్గొన్నారు. అలాగే.. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు హమీద్, అబ్రహాం, శ్రీనివాసులు, శంకర్, సలాం, పుల్లయ్య పాల్గొన్నారు. ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బెనర్జీ మాదిగ ఆధ్వర్యంలో నాయకులు నరసింహులుతో కలిసినివాళులర్పించారు.

డీడీఏ కార్యాలయంలో..

ఎఫ్‌టీసీ డీడీఏ చెన్నయ్య ఆధ్వర్యంలో ఏడీఏ రాజశేఖర్, ఏఓ ప్రసాదరావు, సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



డీడీఏ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వ్యవసాయాధికారులు



ఆర్టీసీ సిబ్బందికి పూలే పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

ఆర్టీసీ గ్యారేజీలో..

నంద్యాల(వ్యవసాయం): మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని ఆర్టీసీ డిపోలో మేనేజర్ గంగాధర్‌రావు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతిరావు పూలే సంస్కరణ గురించి సిబ్బందికి తెలియజేశారు. మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్, అసిస్టెంట్ మేనేజర్ కిశోర్, సిబ్బంది సుబ్బరాజు, అల్లాబకాష్ పాల్గొన్నారు.

ఏఈఓలు రవి, మనోహర్ పాల్గొన్నారు.

పూలే సేవలు మరువలేనివి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు మరువలేనివని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంగన్న అన్నారు. పూలే జయంతిని శుక్రవారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అసమానతలపై పోరాడిన ఆదర్శ మూర్తి జ్యోతిరావుపూలే అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, నాగమస్తాన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పూలే అడుగుజాడల్లో నడవాలి

రుద్రవరం: యువత మహాత్మా జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు సూచించారు. జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయ బృందంతో కలిసి ప్రిన్సిపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రుద్రవరం ఆదర్శ పాఠశాలలో పూలే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రకృతి విపత్తులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ ఓబులేసు

ఉయ్యాలవాడ: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలు, రైతులకు తెలియజేయవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉందని మైనర్ ఇరిగేషన్ ఏడీ ఓబులేస్, తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన విపత్తుల సమీక్షా సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు సాగు చేసిన తరువాత తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకునేలా తెలియజేయాలన్నారు. అలాగే ప్రకృతి వైపరీత్యాలతో అతివృష్టి, అనావృష్టితో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై వ్యవసాయ శాఖ, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలకు వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో రైతుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఓ ఈశ్వరరావు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హుసేన్‌బాషా



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల బార్ అసోసియేషన్‌కు శుక్రవారం జరిగిన ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది హుసేన్‌బాషా అధ్యక్షుడిగా గెలుపొందారు. స్థానిక కార్యాలయంలో 418 మంది న్యాయవాదులు నమోదు చేసుకోగా..ఎన్నికల్లో 389 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు రామకృష్ణయ్య, తాలంకి ప్రసాద్, రఘుప్రకాష్ తెలిపారు. అధ్యక్ష స్థానానికి జగన్‌మోహన్‌రెడ్డిపై 25 ఓట్ల తేడాతో హుసేన్‌బాషా గెలుపొందారు. జనరల్ సెక్రటరీగా బాలసుబ్బయ్యపై ఎంఆర్ కృష్ణారెడ్డి 79ఓట్ల మెజార్టీతో గెలిచారు. జాయింట్ సెక్రటరీగా శేషసాయిపై బాలునాయక్ 203 మెజార్టీ రాగా, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీకి ప్రసాదరెడ్డిపై చిన్న లింగమయ్య 7 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నామినేషన్ రోజున వైస్ ప్రెసిడెంట్‌గా బీఎస్‌వీ సుబ్బరాయుడు, ట్రెజరర్‌గా మద్దిలేటిస్వామిరెడ్డి, లేడీ రెప్రజెంటేటివ్‌గా సౌజన్య, లైబ్రరీ అండ్ సెక్రటరీగా మద్దిలేటి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గెలిచిన అభ్యర్థులను న్యాయవాదులు సత్కరించి అభినందించారు.

ఒకేషనల్ విద్యతో నైపుణ్యాభివృద్ధి



కేబుల్ నెట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకుడు

ఉయ్యాలవాడ: ఒకేషనల్ విద్య పూర్తి చేసిన వారికి నైపుణ్యావృద్ధితో పాటు పరిశ్రమలతో తక్షణమే ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం మోడల్‌స్కూల్‌లో విద్యనభసిస్తున్న 10వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ద్వారా ఏపీజీబీ బ్యాంకులో నిర్వహణ, జిరాక్స్ సెంటర్, బీఎస్ఎన్ఎల్ ఫైబర్‌నెట్, కేబుల్ కమ్యూనికేషన్‌లపై ఒకేషనల్ ట్రైనర్ వెంకటరమణ శిక్షణ ఇచ్చారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

నంద్యాల(న్యూటౌన్): జీవోలు107, 108ని రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య విద్యను కోట్ల రూపాయలకు అమ్మడంతో పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు రావడం లేదని, రిజిస్ట్రేషన్ ప్రకారం విద్యార్థులకు రావాల్సిన కోటా సీట్లు కోల్పోతున్నారన్నారు. అధికారంలోకి పేద విద్యార్థులకు వైద్య విద్యను అందేలా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. శశిధర్‌రెడ్డి, ప్రవీణ్, మల్లికార్జున పాల్గొన్నారు.

బండలాగుడు బలప్రదర్శన దాతలకు సన్మానం

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో రామాలయం నిర్మించి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా శుక్రవారం బండలాగుడు పోటీలు జయప్రదం కావడతో గ్రామంలో బండలాగుడు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందన సభ ఏర్పాటు చేశారు. మొదటి బహుమతి రూ.60వేలు అందజేసిన డీసీ ప్రెసిడెంట్ బబ్బూరి వెంకటస్వామి, రూ.50వేలు ఇచ్చిన గద్దం సుబ్బారావు, రూ.40వేలు ఇచ్చిన కూనాటి బ్రదర్స్, రూ.30వేలు అందించిన గడ్డిపాటి శివభగవంతరావు, రూ.20వేలు సాయం చేసిన సామినేని గోవిందమ్మ, రూ.10వేలు ఇచ్చిన పామిడి నాగేశ్వరరావు, రూ.7,500 బహుమతి ఇచ్చిన బద్దల విజయలక్ష్మి, రూ.5,116 సాయం చేసిన కందిమళ్ల రంగారావులను సన్మానించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ఆళ్లగడ్డ: రైతుల అవసరాలను ఆసరా చేసుకుని నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్క్వాడ్ ఆఫీసర్ శ్రీనివాసులు హెచ్చరించారు. అమరావతి నుంచి స్పెషల్ స్క్వాడ్ ఆఫీసర్లు పట్టణంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు విక్రయిస్తే తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని దుకాణదారులను ఆదేశించారు. ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏఓ కిషోర్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

నీటి పారుదల వనరులపై శిక్షణ

దొర్నిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం చిన్న నీటి పారుదల వనరులపై గ్రామ రెవెన్యూ అధికారులకు మాస్టర్ ట్రైనర్, ఉప గణాంకాధికారి ప్రసాద్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. బోర్లు, బావులు, కుంటలు, చెరువులు, ఫాంపాండ్స్, ఎత్తిపోతల వివరాలను ఎలా సేకరించాలో వివరించారు. డీటీ మాధవ, ఏఎస్ఓ రామిరెడ్డి, వీఆర్‌ఓలు సాంబశివుడు, నాగేష్, మురళీ, నారాయణస్వామి, రెవనూరు సావిత్రి శ్రీనివాసులు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



భక్తులకు ఉపదేశం ఇస్తున్న శ్రేయానంద సరస్వతి మాతాజీ

ఉయ్యాలవాడ: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రేయానంద సరస్వతి మాతాజీ భక్తులకు సూచించారు. శుక్రవారం స్థానిక కుందూనది ఒడ్డున వెలిసిన వేణుగోపాల స్వామి ఆశ్రమ ఆవరణలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవంలో శ్రేయానంద సరస్వతి, కృష్ణానంద స్వామి, స్కంద దేవానందగిరి స్వాములు భక్తులకు సందేశమిచ్చారు. నేటి ప్రపంచంలో యువత ఫ్యాషన్ వైపు వెళ్తూ సనాతన ధర్మాన్ని మరచిపోతున్నారన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగే సమయంలో అక్కడికి వెళ్లి బోధనలు వినడం ద్వారా భక్తి మార్గం పొందవచ్చన్నారు. ఆశ్రమ నిర్వాహకులు మహానందిరెడ్డి, మండల అధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ, బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. పరిశ్రమల శాఖ జీఎం జవహర్ బాబు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి, ఎల్‌డీఎం రవీందర్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 24 యూనిట్లకు మొత్తం రూ.1.67 కోట్ల విలువైన రాయితీ మంజూరు చేశామన్నారు. జిల్లాలో సుమారుగా 25 వేల టన్నుల మిరప పండిస్తున్న నేపథ్యంలో వాటిని శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తిలో భాగంగా ఆళ్లగడ్డలో తయారవుతున్న చేతి పనిముట్లు, నంది వర్గం టవల్స్‌కు ఎక్కువ ప్రాముఖ్యత ఉందని వాటిని ప్రోత్సహించాలని సూచించారు.

16న జాబ్‌మేళా..

ఈనెల 16వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టౌన్‌లోని జీపీఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. మేళాకు 15 ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు రానున్నారని చెప్పారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్ (మెకానికల్), డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు హాజరు కావచ్చని చెప్పారు. వివరాలకు సెల్ 7981238237, 9542643747, 9573108032 నంబర్లకు లేదా naipunyam.ap.gov.in సంప్రదించాలన్నారు.జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి, జీఎం ఇండస్ట్రీస్ జవహర్ బాబు, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజా మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

మే నెలాఖరు నాటికి ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇళ నిర్మాణాల్లో జిల్లా రాష్ట్రంలో దిగువ స్థానంలో ఉందన్నారు. కేటాయించిన 9,432 గృహాల లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 2,500 ఇళ్లు పూర్తి చేశారన్నారు. 14 మండలాలు 20శాతం కన్నా తక్కువ ప్రగతి సాధించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. హౌసింగ్ ఈఈ శ్రీహరి గోపాల్, ఏఈలు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష 21కి వాయిదా

గోస్పాడు: మోడల్ స్కూల్లో ఆరవ తరగతి ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఈనెల 21వ తేదీకి వాయిదా పడిందని ప్రిన్సిపాల్ ఖాజా హుసేన్ తెలిపారు. శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్లో ఆయన మాట్లాడుతూ ఈనెల 20న పరీక్ష నిర్వహించాల్సి ఉండగా.. ఈస్టర్ పండుగ సందర్భంగా 21 తేదీకి వాయిదా వేశారని చెప్పారు. పరీక్ష సమయం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల(అర్బన్): విద్యుత్ తీగల సవరణ, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పట్టణంలోని డి-1, డి-2, డి-3 సబ్‌స్టేషన్ల పరిధిల్లోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈలు నాగరాజు, రామయ్య, రవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డి1 పరిధిలోని సంతగేటు, బాల్కొండహాల్, గుడిపాటి గడ్డ, ముల్లాన్‌పేట, జగజ్జననీ టెంపుల్, చాంద్‌బాడా, రోజాకుంట, బైటిపేట, తెలుగుపేట, పప్పులబట్టి బజార్, డి2 పరిధిలోని దేవనగర్, సాయిబాబానగర్, ఎన్‌జీఓ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, టెక్కె, సరస్వతి, టీచర్స్ కాలనీల్లో సరఫరాను నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే.. డి3 పరిధిలోని బొమ్మసత్రం, బొగ్గులైన్ ఘట్బాల్‌నగర్, వీసీ కాలనీ, జ్ఞానాపురం, వైఎస్ నగర్, బస్టాండ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉత్తమ నటుడికి అభినందన

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల రాష్ట్ర ఉగాది పురస్కారాన్ని అందుకున్న నంద్యాలకు చెందిన కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి సుంకర రాజశేఖర్ ప్రసాద్‌ను శుక్రవారం స్థానిక మధుమణి నర్సింగ్ సమావేశ భవనంలో సాహిత్య ప్రియులు

సంక్షిప్తం

ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ సుంకర రాజశేఖర్‌ప్రసాద్ కండెక్టర్ వృత్తిలో కొనసాగి లాభాపేక్ష లేకుండా ఎన్నో నాటకాలు, టీవీ సీరియల్స్‌లో నటించి ఉత్తమ నటుడిగా కళారత్న హంస అవార్డు అందుకున్నారని ప్రశంసించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఎన్ఎండీ ఫయాజ్, వర్ధంశెట్టి రాజారాం, కొండయ్య, రవీంద్రనాథ్, మధుసూదనరావు, శ్రీరామమూర్తి, డాక్టర్ రవికృష్ణ, నాగమహేష్, నాగిరెడ్డి, షావలిరెడ్డి పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ హాజరును నిర్లక్ష్యం చేయరాదు

గోస్పాడు: ఎఫ్ఆర్ఎస్ హాజరుపై సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల మాతా శిశు సంరక్షణ బ్లాక్‌లోనున్న సమావేశ భవనంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న జూనియర్, సీనియర్ సహాయకులు, మినిస్టీరియల్ సిబ్బందితో సమీక్షా నిర్వహించారు. సిబ్బంది తీసుకోవలసిన జాగ్రత్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది నెలవారి జీతాలు, అలవెన్సుల బిల్లులు, ఎఫ్ఆర్ఎస్ హాజరు మొదలగు వాటిని సక్రమంగా నిర్వహించేలా చూడాలని చెప్పారు. ఏఓ భరత్ కుమార్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురం అంగన్‌వాడీ కేంద్రం-2లో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు జాతీయ సురక్షిత మాతృత్వంపై వైద్యాధికారి బాబు అవగాహన కల్పించారు. ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం తీసుకోవాలని ఆయన సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని, ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకోవాలన్నారు. అనంతరం వైద్య, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఇంటిపైనే విద్యుత్ ఉత్పత్తి

దొర్నిపాడు: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకుంటే ఇంటిపైనే విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని ఏడీఈ సతీష్ కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సూర్య ఘర్ యోజనపై ఆయన అవగాహన కల్పించారు. సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు రాయితీతో పాటు రుణసదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ చార్జీల మోత తగ్గుతుందన్నారు. ఐదు కిలోవాట్ల సోలార్ ప్యానల్స్ నెలకు 600 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుందన్నారు. ఇందులో 300 యూనిట్లను ఇంటి అవసరాలకు వాడుకున్నా మిగిలిన 300 యూనిట్లను విద్యుత్ శాఖకు విక్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ప్రత్యేకాధికారి గోవిందనాయక్, తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ సావిత్రి, ఏఈ అనంతరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ కుక్కలయ్య తదితరులు పాల్గొన్నారు.

- రుద్రవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి నాగరాజు, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, విద్యుత్ ఏఈ అనిల్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నాగరాజు, విద్యుత్ సబ్ ఇంజినీర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): ఐఎంఏ మహిళా విభాగం ఆధ్వర్యంలో విశ్రాంత అధ్యాపకులు జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం పర్యవేక్షణలో నవజీవన్ బదిరులకు క్రీడా పరికరాలు పంపిణీ చేసినట్లు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రవికృష్ణ, డాక్టర్ కల్పన, రవికాంత్‌రెడ్డి, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బదిర బాలికల నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. నిర్వాహకులు సిస్టర్ జ్యోతి, ప్రిన్సిపాల్ పద్మావతి, ఏఓ భాస్కర్, కో ఆర్డినేటర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే తిరగబడండి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలంతా తిరగబడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్మార్ట్ మీటర్ల మా ఇంటికి బిగించొద్దు, కరెంట్ చార్జీలు తగ్గించండి.. అంటూ కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించి పగలగొట్టండి, విరగొట్టి తిరబడండి అని పిలుపునిచ్చిన చంద్రబాబునాయుడు.. అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించడం లేదని, మోదీ చెప్పిందే వేదంగా అదానీ సంస్థ సెకీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయడం లేదన్నారు. స్మార్ట్ మీటర్లను బిగిస్తే మూడింతల బిల్లు వస్తుందని, ప్రజలంతా తిరగడాలన్నారు. మహమ్మద్‌గౌస్, వెంకటలింగం, సీనియర్ నాయకులు తోటమద్దులు పాల్గొన్నారు.